తెలుగు రాష్ట్రాల్లో కీలక ప్రవేశపరీక్ష... ఎంసెట్/ ఈఏపీసెట్. విద్యార్థి తాను చదవదల్చిన కోర్సు కళాశాల, బ్రాంచీని ఎంచుకోవడానికి ఈ ర్యాంకు కీలకం. ఎక్కువ మార్కులూ, ర్యాంకు తెచ్చుకోగలిగితే మేటి కళాశాలలో కోరుకున్న విభాగంలో చేరవచ్చు. ఈ సంవత్సరం ఇంటర్మీడియట్ మార్కులకు వెయిటేజీ లేదు. ప్రథమ సంవత్సరం సిలబస్‌లో 70, ద్వితీయ సంవత్సరం వంద శాతం సిలబస్ నుంచి ప్రశ్నలు వస్తాయి. విద్యార్థులు ఈ విషయాలు దృష్టిలో ఉంచుకుని సన్నద్ధతను కొనసాగించాలి!

ఇంజినీర్ లేదా డాక్టర్ లక్ష్యంతో తెలుగు రాష్ట్రాల్లోని ఎక్కువ మంది విద్యార్థులు ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో చేరుతున్నారు. తల్లిదండ్రులూ ఈ కోర్సులపై ఆసక్తి చూపుతున్నారు. ఇంజినీరింగ్‌కు ఐఐటీ, ఎన్ఐటీలు ఎంతో పేరున్న సంస్థలు. అయితే దాదాపు అదే స్థాయిలో రాష్ట్ర స్థాయి సంస్థలూ కొన్ని ఉన్నాయి. జేఎన్‌టీయూ, ఉస్మానియా, ఏయూ, మరికొన్ని స్థానిక ఇంజినీరింగ్ కళాశాలల్లో ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరడానికి ఎంసెట్/ఈఏపీసెట్ స్కోరు ప్రామాణికం. ఇందులో సాధించిన మార్కులతోనే అగ్రికల్చరల్ ఇంజినీరింగ్, బయోటెక్నాలజీ, డైరీ టెక్నాలజీ, ఫుడ్ టెక్నాలజీ, బీఫార్మసీ, ఫార్మ్ డీల్లో ప్రవేశం పొందవచ్చు. బైపీసీ విద్యార్థులు ఎంసెట్‌తో బీఎస్సీ అగ్రికల్చర్, బీఎస్సీ హార్టికల్చర్, బీఎస్సీ ఫారెస్ట్రీ, బీవీఎస్సీ (వెటర్నరీ సైన్స్), బీఎఫ్‌ఎస్సీ (ఫిషరీస్), ఫుడ్ టెక్నాలజీ, బీఫార్మసీ, బయో టెక్నాలజీ, ఫార్మ్ డి, బీఎస్సీ నర్సింగ్‌ల్లో చేరవచ్చు.

తెలంగాణలో మే 7 నుంచి 11 వరకు, ఏపీలో మే 15 నుంచి ఎంసెట్/ ఈఏపీసెట్ నిర్వహిస్తారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం అకడమిక్ పరీక్షలతోపాటు ఈ పరీక్షకు సమాంతరంగా సన్నద్ధత కొనసాగించాలి. ముఖ్యాంశాలన్నీ నోట్సు రాసుకోవాలి. పబ్లిక్ పరీక్షల తర్వాత 30-40 రోజుల సమయం ఉంటుంది. కాబట్టి ప్రథమ, ద్వితీయ సంవత్సరాల పాఠ్యాంశాల పునశ్చరణ ప్రారంభించాలి. మార్కెట్‌లో దొరికే ఎంసెట్/ఈఏపీసెట్ పుస్తకాలు లేదా షార్ట్ టర్మ్ ప్రోగ్రాంతో కానీ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల పాఠ్యాంశాలను 12+12 రోజులుగా విభజించుకుని ముఖ్యాంశాలన్నీ చదువుకోవాలి. వీలైనన్ని గ్రాండ్ టెస్టులు రాసి తప్పులు సరిచేసుకోవాలి. గత సంవత్సరాల్లో నిర్వహించిన ప్రశ్నపత్రాలనూ సాధన చేస్తే పరీక్షపై అవగాహన పెరుగుతుంది. ప్రశ్నల సరళి తెలుసుకోవచ్చు. ఈ సన్నద్ధతలో అర్థం కానివి, కష్టంగా అనిపించినవి అధ్యాపకులతో నివృత్తి చేసుకోవాలి.

ఎంసెట్/ ఈఏపీసెట్‌లో వేగం, కచ్చితత్వం ముఖ్యం. ఎందుకంటే ఎంసెట్‌లో ఇంజినీరింగ్ విభాగంలో మ్యాథ్స్ 80, ఫిజిక్స్ 40, కెమిస్ట్రీ 40 ప్రశ్నలు వస్తాయి. 160 ప్రశ్నలకు 180 నిమిషాల్లో సమాధానం రాయాలి. ఈ మధ్య ఎక్కువ మంది విద్యార్థులు గణితంలో ప్రశ్నలకు సమయం చాలక ఇబ్బంది పడుతున్నారు. కొవిడ్‌తో రెండేళ్ల పాటు అకడమిక్స్‌కు అంతరాయం ఏర్పడింది. విద్యార్థుల్లో గణన సామర్థ్యం కొంత తగ్గింది. అందువల్ల బాగా సాధన చేయడం తప్పనిసరి. ఆన్‌లైన్ పరీక్ష కాబట్టి ప్రీక్లిన్‌పై ప్రశ్నలను జాగ్రత్తగా చదివి, సరైన జవాబు గుర్తించాలి. ఏ విభాగం వారైనా 100+ మార్కులు సాధిస్తేనే పేరున్న కళాశాలలో ప్రవేశం పొందవచ్చు.

వేగం, కచ్చితత్వం.. మార్కుల వ్యూహం!

మ్యాథ్స్

ఇంజినీరింగ్ ర్యాంకు ఈ విభాగంలో సాధించిన స్కోరుపై ఎక్కువ ఆధారపడి ఉంటుంది. ఫిజిక్స్, కెమిస్ట్రీ రెండు సబ్జెక్టులూ కలిపి 80 మార్కులు. ఒక్క గణితానికే 80 మార్కులు కాబట్టి ఎక్కువ దృష్టి వహించాలి. వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధన చేస్తే, ఉన్న వ్యవధిలోపే సమాధానం గుర్తించి, ఎక్కువ మార్కులు పొందవచ్చు. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు సన్నద్ధమవుతూనే సూత్రాల పునశ్చరణ, సమస్యల సాధన చేయాలి.

ప్రథమ సంవత్సరంలో 70 శాతం సిలబస్ దృష్టిలో ఉంచుకుని ప్రమేయాల్లో ప్రదేశం, వ్యాప్తి, సంయుక్త ప్రమేయాల వరకు చూసుకోవాలి. సదిశల్లో సదిశా సంకలనంలో సరేఖీయ నియమాలు, సదిశల మధ్య కోణం, సమాంతర సదిశలు, సదిశా త్రికలబ్ధం వరకు మననం చేసుకోవాలి. మాత్రికల్లో నిర్ధారకం, గాస్ జోర్డాన్ పద్ధతిలో సమీకరణ సాధన తప్ప మిగిలిన ప్రాథమిక అంశాలపై పట్టు సాధించాలి. త్రికోణమితిలో త్రికోణమితీయ సమీకరణాలు, విలోమ త్రికోణమితీయ ప్రమేయాలు తొలగించారు. ఎత్తులు, దూరాలు మినహాయించారు. మిగిలినవాటిలో త్రిభుజ ధర్మాలు, పరివర్తనాలపై శ్రద్ధ పెట్టాలి. బిందుపథం, అక్ష పరివర్తనం, సరళరేఖల నుంచి ప్రశ్నలు అడగొచ్చు. సరళరేఖా యుగ్మాల్లో కోణం సమద్వి ఖండన రేఖాయుగ్మం తొలగించారు. 3డిలో తలం తొలగించారు. అవధులు అవిచ్ఛిన్నతలో ప్రాథమికాంశాలపై ప్రశ్నలు తప్పనిసరిగా ఉంటాయి. అవకలనంలో విలోమ ప్రమేయాల అవకలనం, ద్వితీయ, పై అవకలనం తొలగించారు. ద్వితీయ సంవత్సరంలో వృత్తాల నుంచి 5 ప్రశ్నలు, పరావలయం- 2, దీర్ఘ వృత్తం- 2, అతిపరావలయం- 1, సమాకలనం- 3, నిశ్చిత సమాకలనం- 2, వైశ్లాల్యాలు- 1, అవకలన సమీకరణాలు- 3-4, వర్గసమీకరణాలు, సమాసాలు- 2, సమీకరణ సంవాదం- 2, ప్రస్తారాలు, సంయోగాలు- 2, ద్విపద సిద్ధాంతం- 3, పాక్షిక భిన్నాలు- 1, సంకీర్ణ సంఖ్యలు డీమాయర్స్ థియరం- 3, సంభావ్యత- 4, సాంఖ్యకశాస్త్రం నుంచి 1 ప్రశ్న వస్తాయి.

> ప్రతి సబ్జెక్టులోనూ బేసిక్స్, కాన్సెప్ట్స్, ఫార్ములాలు, అప్లికేషన్స్‌ను బాగా చదవాలి. పరీక్ష రాసేటప్పుడు ఒత్తిడికి లోనుకాకుండా, నేర్చుకున్న విషయాలను అనువర్తనం చేసుకుంటూ, అనుకూలమైన సబ్జెక్టుతో సమాధానాలు ప్రారంభించాలి. కష్టమైన ప్రశ్నలకు అధిక వ్యవధిని కేటాయించకూడదు. వీలైనన్ని ఎక్కువ ప్రశ్నలకు సమాధానం ఇవ్వగలగాలి. ఆ తర్వాత అన్ని ప్రశ్నలకూ జవాబులు గుర్తించాలి. ఎందుకంటే ఈ పరీక్షలో రుణాత్మక మార్కులు లేవు.

ఫిజిక్స్

ఫిజిక్స్‌లో మంచి మార్కుల కోసం సూత్రాలు, యూనిట్లు, సిద్ధాంతాలు బాగా చదవాలి. మెకానిక్స్, వేవ్స్, థర్మోడైనమిక్స్, మోడర్న్ ఫిజిక్స్, ఎలక్ట్రిసిటీ అండ్ మ్యాగ్నటిజం, ఆప్టిక్స్ ముఖ్యమైనవి. పాత ప్రశ్నపత్రాలు పరిశీలిస్తే ఈ విభాగంపై అవగాహన పొందవచ్చు. విద్యుత్, అయస్కాంతత్వం అత్యంత ముఖ్యమైనవి. వీటికి 20 శాతం వెయిటేజీ ఉంటుంది. గురుత్వాకర్షణ, స్ట్రయిట్ లైన్ మోషన్, మెకానికల్ ప్రాపర్టీస్ ఆఫ్ సాలిడ్స్, థర్మల్ ప్రాపర్టీస్ ఆఫ్ మ్యాటర్, థర్మోడైనమిక్స్, రొటేటరీ మోషన్, వేవ్స్, రే ఆప్టిక్స్, న్యూక్లీ, సెమీ కండక్టర్స్ బాగా అధ్యయనం చేయాలి. ప్రథమ సంవత్సరంలో 70 శాతం సిలబస్ నుంచే ప్రశ్నలు వస్తాయి. 30 శాతం అంశాలు చదవాల్సిన అవసరం లేదు. కెప్లర్ లాస్, ప్యార్లల్, పర్పెండిక్యులర్ యాక్సిస్ థీరమ్స్, హీట్ ట్రాన్స్‌ఫర్, ఫిజికల్ వరల్డ్ వీటిని మినహాయించారు. ద్వితీయ సంవత్సరం అన్ని అంశాల పైనా దృష్టి సారించి, వీలైనన్ని మాక్ పరీక్షలు రాస్తే, ఎక్కువ మార్కులు పొందవచ్చు.

కెమిస్ట్రీ

అకాడెమీ పుస్తకాలే బాగా చదవాలి. ఇంటర్మీడియట్ బోర్డు పరీక్షల సన్నద్ధతతో నేర్చుకునే అంశాలు జాగ్రత్తగా చదుపుకుంటే ఎంసెట్‌కూ ఎంతో ఉపయోగపడతాయి. ఇంటర్ పరీక్షల తర్వాత ఉన్న వ్యవధిలో ముఖ్యాంశాలన్నీ నోట్సు రాసుకోవాలి. ఆర్గానిక్ కెమిస్ట్రీ, నేమ్డ్ రియాక్షన్స్, రీఏజెంట్స్, ఇంటర్ కన్వర్షన్స్‌కి ప్రాధాన్యం ఇవ్వాలి. ఇనార్గానిక్ కెమిస్ట్రీలో పట్టికలు, గ్రాఫ్‌లు, పటాలు, మూలక ధర్మాలు, పేరుతో కూడిన తయారీ పద్ధతులు (నేమ్డ్ ప్రాసెస్) సాధన చేయాలి. భౌతిక రసాయనశాస్త్రంలో సాధారణంగా ఫార్ములా ఆధారిత న్యూమరిక్ ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి పాఠ్యాంశాల్లోని ఫార్ములాలు, స్థిర విలువలు, యూనిట్‌పై దృష్టి వహించాలి. ఇవన్నీ ఒక దగ్గర రాసుకుని, అప్పుడప్పుడూ చదువుకోవాలి. ప్రతి అధ్యాయం నుంచీ కనీసం ఒక ప్రశ్న అయినా వస్తుంది కాబట్టి వేటినీ నిర్లక్ష్యం చేయకూడదు. కష్టమైన అధ్యాయాల నుంచి తేలికైన ప్రశ్నలే రావచ్చు కాబట్టి అసలు చదవకుండా ఉండొద్దు. ఏ ప్రశ్ననూ వదలొద్దు.

వీటిని పాటించండి!

1. ఇంటర్ పరీక్షల సన్నద్ధత ఎంసెట్/ ఈఏపీసెట్‌కూ ఉపయోగం.
2. ప్రతి సబ్జెక్టుకూ రోజులో కొంత సమయం వెచ్చించి చదవాలి.
3. వెయిటేజీ ఎక్కువ ఉన్నవాటినీ, పట్టున్నవాటినీ ప్రాధాన్యంతో చదువుకోవాలి.
4. చాప్టర్లవారీ పరీక్షలు రాయడం మేలు.
5. వీలైనన్ని మాక్ పరీక్షలు రాసి, ఫలితాలు విశ్లేషించుకోవాలి. తప్పులు పునరావృతం కాకుండా చూసుకోవాలి.
6. పాత ప్రశ్నపత్రాలు సమీక్షించుకుని, ప్రశ్నల సరళి అర్థం చేసుకోవాలి.
7. పరీక్ష రాస్తున్నప్పుడు ప్రశ్నక్షుణ్ణంగా చదివిన తర్వాతే జవాబు గుర్తించాలి.
8. తెలియని ప్రశ్నలకు ఎలిమినేషన్ పద్ధతి ద్వారా జవాబు గుర్తించడానికి ప్రయత్నించాలి.
9. రుణాత్మక మార్కులు లేవు కాబట్టి అన్ని ప్రశ్నలకూ సమాధానం ఇవ్వటం మరవొద్దు!

– పద్మశ్రీ జాలాది, డీన్, శ్రీ చైతన్య విద్యాసంస్థలు

ఇర్షాద్ (ఫిజిక్స్), ఆనంద్ (కెమిస్ట్రీ), వెంకటేశ్వర్లు (మ్యాథ్స్)ల సహకారంతో

మా మనవరాలు పదో తరగతి చదువుతోంది. సైకాలజీలో కెరియర్‌ను ఎంచుకోవాలని అనుకుంటోంది. ఇందుకోసం ఇంటర్మీడియట్‌లో ఏ గ్రూప్ తీసుకుంటే మేలు?

- డి.రాఘవరావు

■ పదో తరగతి చదివేప్పుడే సైకాలజీ లాంటి సబ్జెక్టును చదవాలని నిర్ణయించుకోవడం అనే విషయాన్ని మీరంత సీరియస్‌గా తీసుకోకండి. 14, 15 సంవత్సరాల వయసులో పిల్లలకు కెరియర్ నిర్ణయాలు తీసుకొనేంత పూర్తి సామర్థ్యం ఉండదు. ఇప్పుడు తీసుకొన్న నిర్ణయాలు, మరో సంవత్సరం తరువాత మారిపోయే అవకాశాలు ఎక్కువ. ఇంటర్‌లోనే సైకాలజీ కాంబినేషన్‌తో ఉన్న కోర్సులు తీసుకుంటే డిగ్రీలో ఇంజినీరింగ్/ మెడిసిన్/ బీఎస్సీ లాంటి కోర్సుల్లో చదివే అవకాశాన్ని కోల్పోతారు. కానీ ఇంటర్‌లో ఏ కోర్సులు చదివినా డిగ్రీలో బీఏ (సైకాలజీ/ ఇంగ్లిష్/ ఎకనామిక్స్/జర్నలిజం/ హిస్టరీ/ పొలిటికల్ సైన్స్/ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్/ రూరల్ డెవలప్‌మెంట్)/ బీకాం/ బీబీఏ/ ఐదు సంవత్సరాల లా కోర్సు/ హోటల్ మేనేజ్‌మెంట్/ ఫ్యాషన్ టెక్నాలజీ/ ఫైన్ ఆర్ట్స్ లాంటి కోర్సులను కూడా చదివే అవకాశం ఉంటుంది. మీ మనవరాలు సైకాలజీ సబ్జెక్టును ఎందుకు ఇష్టపడుతోందో, తనకు ఆ సబ్జెక్టుపై ఎంత అవగాహన ఉందో తెలుసుకునే ప్రయత్నం చేయండి. కొన్నిసార్లు పిల్లలు మ్యాథ్స్/ సైన్స్ సబ్జెక్టు అర్థంకాక, ఆ సబ్జెక్టులను వదిలివేయడానికి ఇలాంటి కోర్సులను ఎంచుకొని, కొన్ని సంవత్సరాల తరువాత, తెలిసీ తెలియని వయసులో తప్పు నిర్ణయం తీసుకొన్నామని బాధ పడతారు. అమ్మాయి చదివే స్కూల్ ఉపాధ్యాయులతో మాట్లాడి వారి అభిప్రాయాల్ని కూడా తెలుసుకోండి. అవకాశం ఉంటే ఆమెను మంచి కెరియర్ కౌన్సెలర్ దగ్గరికి తీసుకొని వెళ్ళండి. అన్ని రకాలుగా ఆలోచించిన తరువాతే సరైన నిర్ణయం తీసుకోండి.

- ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

సైకాలజీ అంటే ఇష్టం అంటోంది..

నోటిఫికేషన్స్

ఉద్యోగాలు

సీపీపీఆర్ఐ-యూపీలో..

ఉత్తర్‌ప్రదేశ్‌లోని సెంట్రల్ పల్ప్ అండ్ పేపర్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీపీపీఆర్ఐ) 34 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టులు: కన్సల్టెంట్, ప్రాజెక్ట్ అసోసియేట్లు, ప్రాజెక్ట్ స్టాఫ్, నాన్ సైంటిఫిక్ స్టాఫ్ తదితరాలు.

అర్హత: పోస్టును అనుసరించి బీఎస్సీ/ గ్రాడ్యుయేషన్/ ఎంఎస్సీ/ ఎంటెక్/ పీజీ డిగ్రీ/ ఎంబీఏ/ పీహెచ్‌డీ.

వయసు: 35-50 ఏళ్లు. **ఎంపిక:** స్క్రీనింగ్, టెస్ట్/ ఇంటర్వ్యూ/ రాతపరీక్ష ఆధారంగా. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో పంపాలి.

చిరునామా: డైరెక్టర్, సీపీపీఆర్ఐ, హిమ్మత్‌నగర్, పేపర్‌మిల్ రోడ్, సహరన్‌పూర్-247001 యూపీ. **దరఖాస్తుకు చివరి తేదీ:** ఎంప్లాయిమెంట్ న్యూస్‌లో ఉద్యోగ ప్రకటన వెలువడిన 21 రోజుల్లోపు. **వెబ్‌సైట్:** https://www.cppri.res.in/careers

యూసీఐఎల్-ఝార్ఖండ్‌లో..

ఝార్ఖండ్‌లోని యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యూసీఐఎల్) 17 ఫోర్‌మెన్ (మైనింగ్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: డీజీఎంఎస్ ద్వారా పొందిన ఫోర్‌మెన్ సర్టిఫికెట్/ సెకండ్ క్లాస్/ ఫస్ట్‌క్లాస్ మేనేజర్ సర్టిఫికెట్.

అనుభవం: కనీసం ఏడాది పని అనుభవం ఉండాలి.

వయసు: 50 ఏళ్ల మించకూడదు. **ఎంపిక:** ఇంటర్వ్యూ ఆధారంగా. **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో పంపాలి.

చిరునామా: Gen.Manager sInst./Pers.&I~./CPz Uranium Corporation of India Limited, sA Government of India Enterprisez P.O. Jaduguda Mines, Distt.n Singhbhum East, JHARKHANDn832102.

దరఖాస్తుకు చివరి తేదీ: 10.04.2023.

వెబ్‌సైట్: http://www.ucil.gov.in/job.html

అంబేద్కర్ యూనివర్సిటీలో టీచింగ్ పోస్టులు

డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ యూనివర్సిటీ దిల్లీ.. కింది విభాగాల్లో రెగ్యులర్ ప్రాతిపదికన 20 ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

★ ప్రొఫెసర్: 7 ★ అసోసియేట్ ప్రొఫెసర్: 8
★ అసిస్టెంట్ ప్రొఫెసర్: 5

విభాగాలు: అర్బన్ స్టడీస్, గ్లోబల్ స్టడీస్, హిస్టరీ, ఇంగ్లిష్, సోషియాలజీ, ఎకనామిక్స్, సైకాలజీ తదితరాలు.

అర్హత: సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీతో పాటు నెట్/ స్లెట్/ సెట్. **ఎంపిక:** ప్రెజెంటేషన్, సెమినార్, ఇంటర్వ్యూ ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 22.03.2023.
హార్డ్ కాపీ సమర్పణకు చివరి తేదీ: 29.03.2023.
వెబ్‌సైట్: https://aud.ac.in/

ఆర్మీ పబ్లిక్ స్కూల్‌లో..

గోల్కొండలోని ఆర్మీ పబ్లిక్ స్కూల్ (ఏపీఎస్) 12 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టులు: అడ్మిన్ సూపర్‌వైజర్, ఎల్‌డీసీ, కంప్యూటర్ ల్యాబ్ అసిస్టెంట్, సైన్స్ ల్యాబ్ అసిస్టెంట్, డ్రైవర్, గార్డెనర్ తదితరాలు.

అర్హత: పోస్టును అనుసరించి మెట్రిక్యులేషన్/ 10+2/ గ్రాడ్యుయేషన్. **దరఖాస్తు ఫీజు:** రూ.100.

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్‌లో పంపాలి.

చిరునామా: ఆర్మీ పబ్లిక్ స్కూల్, గోల్కొండ, ఇబ్రహీంబాగ్ పోస్ట్ ఆఫీస్, సన్ సిటీ దగ్గర, హైదరాబాద్-500031.

దరఖాస్తుకు చివరి తేదీ: 20.03.2023.

వెబ్‌సైట్: https://www.apsgolconda.edu.in/index.html

ప్రవేశాలు

నిమ్‌సెట్-2023

నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఎంసీఏ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (నిమ్‌సెట్)-2023 ప్రకటన వెలువడింది. ఈ ఏడాది నిమ్‌సెట్‌ను నిట్, జంషెడ్‌పూర్ నిర్వహిస్తోంది.

తొమ్మిది నిట్‌ల్లో ప్రవేశం: నిమ్‌సెట్‌తో 9 నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)ల్లో ప్రవేశం లభిస్తుంది. వీటిలో వరంగల్ ఒకటి. నిట్‌ల్లో ఎంసీఏ కోర్సు వ్యవధి మూడేళ్లు. అయితే నిట్, వరంగల్ రెండేళ్ల కోర్సు అనంతరం ఫైదొలిగే అవకాశాన్నీ కల్పిస్తోంది. రెండేళ్ల చదువు విజయవంతంగా పూర్తిచేసుకున్నవారికి పోస్టు గ్రాడ్యుయేట్ అడ్వాన్స్‌డ్ డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్ డిగ్రీని ప్రదానం చేస్తుంది.

సీట్ల వివరాలు: అగర్తలా- 30, అలహాబాద్ - 116, భోపాల్ - 115, జంషెడ్‌పూర్ - 115, కురుక్షేత్ర - 96 (వీటిలో 32 సెల్ఫ్ ఫైనాన్స్), రాయ్‌పూర్ - 110, సూరత్కల్ - 58, తిరుచురాపల్లి - 115, వరంగల్ - 58.

మొత్తం సీట్ల సంఖ్య: 813.

అర్హత: మ్యాథ్స్ లేదా స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్టుగా బీఎస్సీ, బీసీఏ, బీఐటీ, బీ వొక్(కంప్యూటర్ సైన్స్/ కంప్యూటర్ అప్లికేషన్స్)ల్లో ఏదైనా కోర్సు చదివుండాలి లేదా ఏ బ్రాంచీలోనైనా బీటెక్/ బీఈ పూర్తిచేసుకున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏ కోర్సు చదివినప్పటికీ కనీసం 60 శాతం మార్కులు (ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు 55 శాతం) తప్పనిసరి. చివరి సంవత్సరం కోర్సుల్లో ఉన్నవారూ అర్హులే.

సీట్ల కేటాయింపు: మెరిట్, రిజర్వేషన్ల ప్రాతిపదికన ఉమ్మడి కౌన్సెలింగ్ ద్వారా సీట్లను కేటాయిస్తారు.

తెలంగాణలో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, వరంగల్.

దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.1250. మిగిలిన అందరికీ రూ.2500 **ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ:** ఏప్రిల్ 10 వరకు. **పరీక్ష తేదీ:** జూన్ 11. **ఫలితాల ప్రకటన:** జూన్ 16.

వెబ్‌సైట్: http://www.nimcet.in/

చదువు

కెరియర్, ఉన్నతవిద్యలకు సంబంధించి మీకు ఏ సందేహాలుఉన్నా వాటిని మాకు పంపండి. నిపుణులు సమాధానాలు ఇస్తారు.

మా చిరునామా: **చదువు, ఈనాడు కార్యాలయం, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రామోజీ ఫిల్మ్‌సిటీ – 501 512** edc@eenadu.in

---

కోర్సుల్లో కొత్తరకం...

డిజిటల్ హ్యుమానిటీస్!

హ్యుమానిటీస్ ఎప్పటి నుంచో ఉన్న సబ్జెక్ట్. మారుతున్న నేటి కాలానికి అనుగుణంగా దీనికి అనుబంధంగా వచ్చిందే 'డిజిటల్ హ్యుమానిటీస్'. కంప్యూటర్‌తోనే సర్వం ముడిపడి ఉన్న ప్రస్తుత రోజుల్లో మనుషుల జీవనవిధానం గురించి అధ్యయనం చేసే ఈ కోర్సుకు రానురానూ డిమాండ్ పెరుగుతోంది. మరి దీని గురించి ఇంకా తెలుసుకుందామా...

హ్యుమానిటీస్‌లో ఉన్న వివిధ రకాల సబ్జెక్టులను డిజిటల్ ప్రపంచంతో కలిపి చూడటాన్నే 'డిజిటల్ హ్యుమానిటీస్' అంటున్నారు. హిస్టరీ, సోషియాలజీ, సైకాలజీ, పొలిటికల్ సైన్స్... ఇలా ఏదైనా సరే, వీటిపైన డిజిటల్ ఏజ్ ప్రభావం ఎలా ఉంది - యాప్స్, స్మార్ట్‌ఫోన్స్... ఇవన్నీ ఎలా ప్రభావితం చేస్తున్నాయి.. ఈ కాలం ఎలా ఉంది, ఉండబోతోంది.. ఇవన్నీ ఈ అధ్యయనంలో భాగం. స్థిరంగా చెప్పాలంటే ఇది హ్యుమానిటీస్ సబ్జెక్టులు, కంప్యూటింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీల సమ్మేళనం.

« గత 50 ఏళ్లుగా మనుషుల జీవితాల్లో కంప్యూటర్ భాగమైపోయింది. వచ్చే కాలంలో ఇది మరింతగా మన జీవనవిధానాన్ని ప్రభావితం చేయనుంది. చదువులు, ఉద్యోగాలు, తీరుతెన్నులు, అన్నీ వేగంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో డిజిటల్ హ్యుమానిటీస్ చదువుకున్నవారి అవసరం కూడా పెరుగుతోంది. ముఖ్యంగా డేటాను నిర్వహించడంలో వీరి సేవలు అధికంగా అవసరమవుతున్నాయి. నిజానికి మన దేశంలో ఈ సబ్జెక్టుపై ఇప్పుడిప్పుడే అవగాహన పెరుగుతోంది. ఐఐటీ జోధ్‌పూర్ వంటి కొన్ని ఉన్నత విద్యాసంస్థలు దీనికి సంబంధించిన కోర్సులను కూడా ప్రవేశపెట్టాయి. అయితే ఉన్న అవకాశాలకు తగినవిధంగా చదువుతున్న విద్యార్థుల సంఖ్య లేదనే చెప్పాలి. ముఖ్యంగా పరిశోధన రంగాల్లో దీనిపై పరిజ్ఞానం ఉన్న అభ్యర్థులకు అత్యధిక డిమాండ్ ఉంది.

ఉద్యోగావకాశాలు

డిజిటల్ హ్యుమానిటీస్ చదివినవారికి విస్తృతమైన కెరియర్ అవకాశాలు ఉన్నాయి. వెబ్ డిజైనర్, సోషల్ మీడియా మేనేజర్, ఇంటరాక్టివ్ ప్రాజెక్ట్ మేనేజర్, డిజిటల్ మార్కెటింగ్ స్పెషలిస్ట్, డిజిటల్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, ఆర్కైవ్స్ లైబ్రేరియన్, డిజిటల్ క్యూరేటర్, టెక్నికల్ రైటర్, ఇన్ఫర్మేషన్ ఆర్కిటెక్ట్.. ఇలా చాలా ఉద్యోగాలు పొందవచ్చు.

కోర్సులు

అశోక యూనివర్సిటీ, జామియా మిలియా ఇస్లామియా, జాదవ్‌పూర్ యూనివర్సిటీ, కేరళ డిజిటల్ యూనివర్సిటీ.. వంటి పలు సంస్థలు ఇందులో డిగ్రీ, పీజీ కోర్సులను అందిస్తున్నాయి. ఆన్‌లైన్‌లో అయితే ఎడ్ఎక్స్, కోర్సెరాలో స్వల్ప కాల వ్యవధి కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడికంటే విదేశాల్లో దీనికి సంబంధించిన విద్యా, ఉద్యోగావకాశాలు మరింత అధికంగా లభిస్తున్నట్లు నిపుణులు చెబుతున్నారు.

తాజా ఇంటర్న్‌షిప్‌లు

విజయవాడలో

సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్/ ట్రయినింగ్

సంస్థ: పింక్‌మూన్ టెక్నాలజీస్ **స్టైపెండ్:** నెలకు రూ.7,500-12,000 **దరఖాస్తు గడువు:** మార్చి 15 **అర్హతలు:** యాంగ్యులర్‌జేఎస్, బూట్‌స్ట్రాప్, డేటా ఎనలిటిక్స్, ఐఓటీ, జావా, జావాస్క్రిప్ట్, మైఎస్‌క్యూఎల్, నోడ్.జేఎస్, పీహెచ్‌పీ, పైథాన్, రియాక్ట్ నేటివ్ నైపుణ్యాలు
☛ internshala.com/i/a5d3d9

పీహెచ్‌పీ అండ్ వర్డ్‌ప్రెస్ డెవలప్‌మెంట్

సంస్థ: టెటావర్స్ **స్టైపెండ్:** నెలకు రూ.10,000-20,000 **దరఖాస్తు గడువు:** మార్చి 9 **అర్హతలు:** సీఎస్ఎస్, హెచ్‌టీఎంఎల్, పీహెచ్‌పీ, వర్డ్‌ప్రెస్ నైపుణ్యాలు ☛ internshala.com/i/b5b6ff

వెబ్‌సైట్ డెవలప్‌మెంట్

సంస్థ: టెటావర్స్ **స్టైపెండ్:** నెలకు రూ.10,000-15,000 **దరఖాస్తు గడువు:** మార్చి 8 **అర్హతలు:** సీఎస్ఎస్, ఫ్లట్టర్, హెచ్‌టీఎంఎల్, జావాస్క్రిప్ట్, నోడ్.జేఎస్, పీహెచ్‌పీ నైపుణ్యాలు
☛ internshala.com/i/280bea

గుంటూరు, హైదరాబాద్‌లో

బిజినెస్ డెవలప్‌మెంట్

సంస్థ: అజ్‌పస ఎడ్యుకేషన్ సర్వీసెస్ **స్టైపెండ్:** నెలకు రూ.15,000 **దరఖాస్తు గడువు:** మార్చి 9 **అర్హతలు:** బిజినెస్ డెవలప్‌మెంట్ నైపుణ్యం, ఆసక్తి ఉన్న విద్యార్థులు ☛ internshala.com/i/edfe56

విశాఖపట్నంలో

యూఐ/యూఎక్స్ డిజైన్

సంస్థ: విహాన్ ఎలక్ట్రిక్స్ **స్టైపెండ్:** నెలకు రూ.3,000 **దరఖాస్తు గడువు:** మార్చి 13 **అర్హతలు:** అడోబ్ ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, ఎక్స్‌డి, స్కెచ్, యూఐ అండ్ యూక్స్ డిజైన్, వైర్‌ఫ్రేమింగ్ నైపుణ్యాలు ☛ internshala.com/i/510561

టెలికాలింగ్

సంస్థ: స్టార్ట్ ఎజ్ బిజినెస్ సొల్యూషన్స్ **స్టైపెండ్:** నెలకు రూ.5,000 **దరఖాస్తు గడువు:** మార్చి 11 **అర్హతలు:** ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, హిందీ మాట్లాడటం, ఎంఎస్-ఎక్సెల్ నైపుణ్యాలు
☛ internshala.com/i/219ac9